ప్రజాశక్తి
సోమవారం 22 ఏప్రిల్ 2024 8 పేజీలు
ప్రకాశం బాపట్ల

హ్యాట్రిక్ విజయం కోసం.?

నేడు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నామినేషన్

ఏలూరికి బి-ఫారం అందజేస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ముచ్చటగా మూడోసారి పర్చూరు అసెంబ్లీ నుంచి తెలుగుదేశం పార్టీ తరపున ఎన్నికల బరిలో నిలిచారు. హ్యాట్రిక్ విజయ సాధనే లక్ష్యంగా సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. 2014, 2019 ఎన్నికల్లో వరుసగా ఏలూరి పర్చూరులో గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రమంతా వైసిపికి అనుకూలంగా ఓటింగ్ జరిగిన నేపథ్యంలో పర్చూరు నుంచి మాజీ మంత్రి డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావును ఎదుర్కొని ఏలూరి విజయం సాధించారు. ఇప్పుడు మూడోసారి పర్చూరు నుంచి ఏలూరి ఎన్నికల బరిలో దిగుతున్నారు. తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షునిగా కొనసాగుతున్నారు.

మొదటి నుంచి తెలుగుదేశం పార్టీ పిలుపు ఇచ్చిన అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటూ వచ్చిన ఏలూరి పర్చూరు నియోజకవర్గం నుంచి 2014లో మొదటి సారి గెలుపొందిన అనంతరం నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి ప్రభుత్వ నిధులతో పాటు తన సొంత నిధులను ఖర్చు చేశారు. వ్యవసాయ రంగం పై మక్కువ ఉన్న ఏలూరి రైతులకు వ్యవసాయాన్ని లాభసాటి వత్తిగా మార్చే యజ్ఞంలో భాగంగా వివిధ రకాల పంటలలో వ్యూహాత్మక సాగు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, కోత అనంతరం నిల్వ మార్కెటింగ్ సౌకర్యాల మెరుగుదల గురించి రైతులకు చేదోడుగా నిలిచారు. తుపానులు సంభవించిన సమయంలో వైసిపి ప్రభుత్వం నుంచి తగిన సాయం రైతులకు చేరని క్రమంలో ఏలూరి తన సొంత ట్రస్టు ద్వారా నియోజకవర్గంలోని వేలాది మంది ▶ 2లో



మాట్లాడుతున్న వైసిపి దర్శి అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా..: బూచేపల్లి

5లో ▶

నల్లమలలో దాహం కేకలు

- పనిచేయని సోలార్ పంపుసెట్లు
- అడుగంటిన భూగర్భజలాలు
- మరమ్మతులకు గురైన మోటార్లు..
- పట్టించుకోని ఐటిడిఏ అధికారులు

పొలాల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న గిరిజన మహిళలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలోని యర్రగొండపాలెం మండలం పరిధిలోని లోతట్టు గిరిజన గూడేల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఇటు ఐటిడిఏ అధికారులు, అటు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో నీటి కోసం అక్కడి ప్రజలు పాట్లు పడాల్సి వస్తోంది.

ముఖ్యంగా గాంధీనగర్ చెంచు గూడెంలో ఉన్న చేతి పంపులు ఒట్టిపోయాయి. రెండు డీప్‌బోర్లు మొరాయించాయి. గతంలో రూ. 24 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకుకు పైపులైన్ వేయలేదు. అది దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. ఆ గూడెంలో 65 కుటుంబాలు, బావిపెంటకు చెందిన 15 కుటుంబాలు వారు కలిసి నివసిస్తున్నారు. 215 మంది దాకా జనాభా ఉంటారు. రోజుకు ఒక్క ట్యాంకర్ నీటినే గూడేనికి సరఫరా చేస్తున్నారు. ఆ నీటితోనే చెంచు గిరిజనులు కాలం గడుపుతున్నారు. ట్యాంకర్ కోసం ఎప్పుడు వస్తుందోనంటూ వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ట్యాంకర్ రాకుంటే వారి పరిస్థితి అంతే..

శాంతినగర్ చెంచుగూడెంలో ఉన్న రెండు చేతి పంపులు ఒట్టిపోయాయి. డీప్‌బోరు మోటారు కాలిపోయింది. రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన ట్యాంకు వృథాగా మారింది. అక్కడ 55 కుటుంబాల వారు నివసిస్తున్నారు. వారికి కూడా ఒక్క ట్యాంకరే ఆధారమైంది. ఆ నీటితోనే కాలం గడుపుతున్నారు. ఇష్టకామేశ్వరి చెంచు గూడెంలో 25 కుటుంబాల వారు నివసిస్తున్నారు. వారికి నీటి సమస్య తీవ్రంగా ఉంది. డీప్‌బోర్లు పని చేయడం లేదు. అక్కడ గల వాగునీరే ఆధారమైంది. కలుషితమైన ఆ నీటిని తాగుతుండడంతో అన్ని కుటుంబాల్లో మలేరియా పాగా వేసింది. అయినా వారిని పట్టించుకునే అధికారులే కరువయ్యారు. పాలుట్ల గిరిజన గూడెంలో 400 కుటుంబాల సుగాలి, చెంచు గిరిజనులు నివసిస్తున్నారు. 1500 దాకా ఆ గూడెంలో జనాభా ఉన్నారు.

చెలమనీరు పడుతున్న గిరిజన మహిళ

సోలార్ షిస్టం ద్వారా మంచి నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేసిన పరికరాలు మరుగునపడ్డాయి. అందులో రెండు మాత్రమే పని చేస్తుండటంతో గూడెం మొత్తం దాని మీదనే ఆధారపడాల్సి ఉంది. దీంతో ఎక్కువ మంది గిరిజనులకు ట్యాంకర్ నీరే ఆధారమైంది. పురాతన కాలంలో నిర్మించిన బావిలో అరకొరగా వస్తున్న నీటిని సైతం వాడుకోవాల్సిన పరిస్థితి అక్కడి గిరిజనులకు వచ్చింది. ఆ నీటిని వాడటం మూలంగా చర్మవ్యాధులు వస్తున్నట్లు గిరిజనులు వాపోతున్నారు.

ఎండిన చలమలు..

రోజురోజుకూ ఎండ తీవ్రత పెరగడంతో పాటు 46 డిగ్రీల దాకా ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో అటవీ ప్రాంతంలో గిరిజనులకు ఆధారమైన నీటి చలమలన్నీ దాదాపుగా ఎండిపోయాయి. ఎక్కడో ఒకటి, అర చెలమ ఉన్న చోటకు వెళ్లి చెంచు గిరిజన మహిళలు గత్యంతరం లేని పరిస్థితుల్లో గంటల కొద్దీ వేచి ఉండి నీటిని పట్టుకుంటున్నారు. పలు చెంచు గిరిజన గూడేల్లో ఐటిడిఏ ఆధ్వర్యంలో రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షల వ్యయంతో ▶ 2లో

టిడిపి అభ్యర్థులకు బి-ఫారాలు..

మంగళగిరిలో పార్టీ కార్యాలయంలో అందజేసిన చంద్రబాబు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోని తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఆదివారం నాడు మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో బి-ఫారాలు అందజేశారు. ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, అసెంబ్లీ అభ్యర్థులు దామచర్ల జనార్ధన్, డాక్టర్ వీరాంజనేయస్వామి, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, గూడూరి ఎరిక్షన్‌బాబు బి-ఫారాలు అందుకున్నారు.

బాపట్ల జిల్లాలో వేమూరు నుంచి పోటీ చేస్తున్న నక్కా ఆనందబాబు, రేపల్లె నుంచి పోటీ చేస్తున్న అనగాని సత్యప్రసాద్, బాపట్ల నుంచి పోటీలో ఉన్న వేగేశన నరేంద్రవర్మ, చీరాల నుంచి ఎంఎం కొండయ్య, పర్చూరు నుంచి ఏలూరి సాంబశివరావు, అద్దంకి నుంచి పోటీ చేస్తున్న గొట్టిపాటి రవికుమార్, బాపట్ల పార్లమెంట్ పరిధిలోని సంతనూతలపాడు నుంచి పోటీలో ఉన్న విజయకుమార్‌కు, బాపట్ల పార్లమెంట్ నుంచి టిడిపి అభ్యర్థి గా పోటీ చేస్తున్న తెన్నేటి కృష్ణప్రసాద్‌కు బి-ఫారాలు అందజేశారు.

ప్రకాశం జిల్లా అభ్యర్థులకు బి-ఫారం అందజేస్తున్న చంద్రబాబు

బాపట్ల జిల్లా అభ్యర్థులకు బి-ఫారం అందజేస్తున్న చంద్రబాబు

నేడు షర్మిల రాక

- యర్రగొండపాలెంలో రోడ్‌షో • చీమకుర్తిలో బహిరంగ సభ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిలారెడ్డి సోమవారం యర్రగొండపాలెం రానున్నారు. వైఎస్.షర్మిలారెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమాయత్తమయ్యాయి. యర్రగొండపాలెంలో షర్మిలారెడ్డికి స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేశారు. నంద్యాల నుంచి బయలుదేరి షర్మిలారెడ్డి యర్రగొండపాలెం చేరుకొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బూదాల అజితారావు నామినేషన్ దాఖలు కార్యక్రమంలో, రోడ్‌షోలో పాల్గొంటారు. అక్కడ నుంచి బయలుదేరి చీమకుర్తి చేరుకుంటారు. సంతనూతలపాడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాలపర్తి విజేష్ రాజుకు మద్దతుగా సాయంత్రం 4 గంటలకు చీమకుర్తిలో జరిగే బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి షర్మిల ప్రసంగించారు. అక్కడ నుంచి బాపట్ల జిల్లా అద్దంకి బయలుదేరి స్థానిక కార్యక్రమాలలో పాల్గొంటారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. ఈ నెల 23న చీరాల, బాపట్లలో ఆమె పర్యటించనున్నారు.

హ్యాట్రిక్ విజయం కోసం.?

(మొదటిపేజీ తరువాయి)

అన్నదాతలకు ఉచితంగా మిరపనారు, తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ చేశారు. గడచిన దశాబ్ధకాలంగా నియోజకవర్గంలో విస్తృతంగా ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా లక్ష మందికి కంటిచూపు అందించాలనే సంకల్పంతో విస్తృతంగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తూ, పేద, బలహీనవర్గాల ప్రజల కోసం మెరుగైన వైద్యం కోసం నియోజకవర్గ గ్రామాల్లో కార్పొరేట్ వైద్యసేవలు అందించారు.

ఇటీవలి వరకు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న వారు పర్చూరులో ప్రతిపక్షాలకు చెందిన ఓట్ల తొలగింపుల కోసం కుట్రలు పన్నిన క్రమంలో అందరినీ సంఘటితం చేసి.. అన్యాయంగా ఓట్ల తొలగింపు జరుగకుండా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం కోర్టులకు వెళ్లి న్యాయ పోరాటం చేశారు. గ్రానైట్ వ్యాపారులపై అక్రమ కేసులు బనాయించి పరిశ్రమ మూతపడే పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వారికి అండగా నిలిచారు. వైసిపి అధిష్ఠానం నియోజకవర్గ ఇన్‌ఛార్జిలను మార్చడంతో వైసిపి క్యాడర్ అభద్రతా భావంలోకి వెళ్లారు. దీంతో పలువురు వైసిపి ప్రజాప్రతినిధులు, నేతలు ఏలూరి ఆధ్వర్యంలో టిడిపిలో చేరుతున్నారు. తెలుగుదేశం పార్టీ మరింత బలపడటానికి విశేష కృషి చేస్తున్నారు.

నేడు ఏలూరి నామినేషన్

తెలుగుదేశం, జనసేన, బిజెపి ప్రజా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించనున్నారు.

నల్లమలలో దాహం కేకలు

(మొదటిపేజీ తరువాయి)

నిర్మించిన సోలార్ పంపుసెట్లలో ఎక్కువ భాగం మరమ్మతులకు గురయ్యాయి. దీంతో హనుమంతుని చెంచుగూడెం, ప్రకాష్ నగర్, వెంకటాద్రిపాలెం చెంచుగూడెం, పునరావాసకాలనీ, బిళ్లగొందిపెంట, పోతురాజుపెంట, అంకమ్మగూడెం, బూరుగుండాల, యల్లారెడ్డిపల్లి చెంచుగూడెం, గుట్టలచేను, పొన్నలబయలు, నెక్కంటి, ఆలాటం తదితర గిరిజన గూడెల్లో చెంచులు నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు.

పేర్నమిట్టలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి నాగార్జున

పేర్నమిట్టలో గడప గడపకూ..

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట గ్రామం, ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని 41వ డివిజన్లో ఆదివారం గడప గడపకూ మన నాగార్జున కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మరియు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ మేరుగు నాగార్జునకు పేర్నమిట్ట గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కత్తినేని విజయ భరతరెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. గత 5 ఏళ్ల కాలంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రావూరి లింగారెడ్డి నాయకులు కత్తినేని శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటేష్‌కు మద్దతు

ప్రజాశక్తి-వేటపాలెం: మండలంలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీ కొణిజేటి నగర్ గ్రామంలో సుమారు 40 కుటుంబాలు చీరాల వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్‌ను కలిసి ఆదివారం సంపూర్ణ మద్దతు తెలియజేశారు. పాపాయి పాలెం పంచాయతీ వాకవారిపాలెంలో 30 కుటుంబాలు మద్దతు తెలియజేశాయి. ఈ కార్యక్రమంలో గవిని శ్రీనివాస రావు, గవిని పండు, వాకా సుబ్బారావు, వాకా మునలయ్య, పావులూరి వంశీ, వాకా గోపి, పులి పెద్దబ్బాయి, గడ్డం చంద్రయ్య, పులి అశోక్, దాసరి వసంతరావు పాల్గొన్నారు.

అభివృద్ధిలో సహకరిస్తా

ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశంలో ఎంఎం కొండయ్య

ప్రజాశక్తి-వేటపాలెం

అభివృద్ధిలో సహకరిస్తానే గాని ప్రజలతో వ్యాపారం చేసే అలవాటు తనకు లేదని టిడిపి కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక ఆర్యవైశ్య గంట కళ్యాణ మండపం నందు ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ వలన వ్యవస్థలన్నీ సర్వనాశనమయ్యాయని అన్నారు. దీంతో ప్రజల కొనుగోలు శక్తి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్యవైశ్యుల వ్యాపారాలు నిరాటకంగా కొనసాగే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వేటపాలెం రైల్వేస్టేషన్ శ్మశానవాటికకు వెళ్లే దారులను, డ్రైనేజీ వ్యవస్థను సరిదిద్దుతానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొగ్గుల పార్థసారథి, నాసిక వీరభద్రయ్య, పొగడదండ వెంకటేశ్వర్లు, సజ్జ వెంకటేశ్వరరావు, దోగుబత్తి బాలకృష్ణ, కూటుకూరి కోటిస్వామి గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎం కొండయ్య

వైసీపీ జెండా ఎగరేద్దాం: కరణం వెంకటేష్

ప్రజాశక్తి-చీరాల

చీరాల నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగురవేసేందుకు అందరూ కృషి చేయాలని, జరగనున్న ఎన్నికలలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గెలిపించాలని కరణం వెంకటేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 2వ వార్డులో పలువురు యువత రామకృష్ణపురం క్యాంప్ కార్యాలయంలో వెంకటేష్‌ను కలిసి ఆయనకు మద్దతు తెలియజేశారు. ఈ నేపథ్యంలో వైసిపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేష్‌ను గెలిపించాలని కోరుతూ వెంకటేష్ సతీమణి కరణం గీత, సోదరి గోరంట్ల సుధారు ఇరువురు మునిసిపల్ 7వ వార్డులో వాళ్ల కుటుంబాలను గడప గడపకూ వెళ్లి కలిసి వైసిపి కరపత్రాలు పంచుతూ వెంకటేష్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం సెయింట్ మార్క్స్ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో వారు పాల్గొన్నారు. వారి వెంట 7వ వార్డ్ కౌన్సిలర్ యాతం జ్యోతి, సునీల్, క్రాంతి, గొర్రెముచ్చు రాజేష్, చిన్న, మల్లెల లలిత రాజశేఖర్, అమర్తపూడి రమాదేవి, వాసిమల్ల బ్రదర్స్, చర్చి ఫాదర్స్ తదితరులు పాల్గొన్నారు. వెంకటేష్‌కు మద్దతు తెలిపిన వారిలో కొండ్రు ప్రతాప్, కొండ్రు జయ కుమార్, కొండ్రు స్టాలిన్, శౌరి, సన్ని, దేవయ్య, సంతోష్, విక్కి, బాలు, సందీప్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు తెలిపిన యువతతో కరణం వెంకటేష్

వైసీపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని మంగమూరు గ్రామంలో ఆదివారం వైసిపి ఎన్నికల కార్యాలయాన్ని ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున ప్రారంభించారు. కార్యక్రమానికి ముందుగా భారతరత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరిన బొంతా శివ మంత్రి నాగార్జున సమక్షంలో తిరిగి వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దుంపా చెంచిరెడ్డి, జెసిఎస్ ఇన్‌ఛార్జి దుంపా యలమందారెడ్డి, చీమకుర్తి సొసైటీ ఛైర్మన్ గోపిరెడ్డి ఓబుల్ రెడ్డి, మంగమూరు సొసైటీ ఛైర్మన్ షేక్ అలీసాహెబ్, మాజీ సర్పంచ్‌లు అబ్బూరి శంకర్రావు, అట్లూరి ప్రసాద్, నాయకులు పి వెంకారెడ్డి, అబ్బూరి రామయ్య, తేళ్ల వీరభద్రయ్య, దమ్మాల శ్రీను, కే సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో టీడీపీ ప్రచారం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండల కేంద్రమైన సంతనూతలపాడు గ్రామంలోని 102,104 పీఎస్‌ల పరిధిలో సంతనూతలపాడు నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి కూటమి అభ్యర్థి బిఎన్ విజయ్ కుమార్ విజయం కోసం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ సూపర్ సిక్స్ గురించి వివరిస్తూ ఆదివారం ఇంటింటికీ తిరుగుతూ పథకాల గురించి వివరించారు. మే 13న జరగనున్న ఎన్నికలలో విజయ్ కుమార్‌ని గెలిపించి చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు, లేదా నెలకు రూ.3000 నిరుద్యోగ భృతి, స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000, ప్రతి రైతుకు ఏటా రూ.20,000 ఆర్థిక సహాయం, ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ప్రతి స్త్రీకి నెలకు రూ.1500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ కార్యనిర్వహణ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు, మాజీ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెరుకూరి శ్రీనివాసరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు బాపట్ల పార్లమెంట్ ఎస్సీ సెల్ కార్యదర్శి మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, తెలుగు మహిళ అధ్యక్షురాలు ఎన్ మాధవీలత, బాపట్ల పార్లమెంట్ టిఎన్‌టియుసి ఆర్గనైజింగ్ సెక్రటరీ పావులూరి నారాయణస్వామి చౌదరి, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మార్పుడి జనార్ధన్, నియోజకవర్గ బీసీ సెల్ కార్యదర్శి కుంచాల ఆంజనేయులు బాపట్ల పార్లమెంట్ పార్టీ కార్యదర్శి కొత్తపల్లి పద్మ, బాపట్ల పార్లమెంట్ టిఎన్‌టియుసి ఉపాధ్యక్షులు చెరుకూరి వెంకటసుబ్బయ్య, బిజెపి మండల అధ్యక్షులు దుంపా కోటిరెడ్డి, మన్నం రామారావు, గుడిపాడు కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాస్ పోర్ట్ పోయినది

ప్రకాశం జిల్లా కొండపి మండలం నేతి వారి పాలెం గ్రామానికి చెందిన షేక్ గుంటూరు వలి తండ్రి షేక్ నన్నే సాహెబ్ కు చెందిన నా పాస్ పోర్ట్ నెంబర్. S2672693 పోయినది. జిరాక్సుల నిమిత్తం కొండపికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మార్గమధ్యంలో పోయినది. ఎంత వెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల ఈ అడ్రస్ ను సంప్రదించగలరు.

ఇట్లు
షేక్ గుంటూరు వలి
తండ్రి షేక్ నన్నే సాహెబ్
నేతివారిపాలెం గ్రామం, కొండపి మండలం,
ప్రకాశం జిల్లా.
ఫోన్ నెంబర్: 7815812556

మహారాజశ్రీ మార్టూరుపురం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
హెచ్.ఎం.ఓ.పి. 37/2022

పొట్టి సత్యావతి ఉరఫ్ ధారా సత్యావతి ...పిటీషనర్

వర్సెస్

పొట్టి సత్యనారాయణ ...రెస్పాండెంట్

నోటీసు

పై నెంబరు హెచ్.ఎం.ఓ.పి.ని అందులోని పిటీషనరు హిందూ వివాహ చట్టము సెక్షన్ 13 (1) ఐఎ) (ఐబి) ప్రకారం మీ ఇరువురి మధ్య జరిగిన వివాహమును రద్దు చేసి విడాకులు పొంద కోరుచూ ఈ నెంబరు దావాలోని రెస్పాండెంట్‌పై దాఖలు చేసియున్నది. సదరు హెచ్.ఎం.ఓ.పి.లో రెస్పాండెంట్ హాజరు నిమిత్తం పై కోర్టు వారు 25-04-2024వ తేదీకి వాయిదా చేసియున్నారు. కనుక సదరు రెస్పాండెంట్‌కు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల 25-04-2024వ తేదీ ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై తన ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల పై కోర్టు వారు హెచ్.ఎం.ఓ.పి.లోని రెస్పాండెంట్ పరోక్షమున ఓ.పి. దావాను విచారించి తీర్మానించ బడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వులతో)

ఐ.నాగేశ్వరరావు
పిటీషనర్ తరపు అడ్వకేట్
మార్టూరుపురం.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు : ఒంగోలు
O.S. 839/2023

పాటిబండ్ల ఇందిరమ్మ ...వాది

Vs

తన్నీరు వరమ్మ ...ప్రతివాది

To,

తన్నీరు వరమ్మ, W/o. వెంకటరావు,
మైనంపాడు గ్రామం, సంతనూతలపాడు మండలం,
ప్రకాశం జిల్లా.

పై నెంబరు గల దావాలో మీ హాజరు నిమిత్తం కోర్టు వారు సమన్లు పంపినప్పటికీ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా నోటీసులు జారీ చేయవలసినదిగా ఉత్తర్వులు జారీ చేసియున్నారు. సదరు ఉత్తర్వుల ప్రకారం తేది: 17-5-2024న పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని మీ లాయరు గారి ద్వారా గాని ఉ. 10.30 ని॥లకు హాజరు కావలసినది. లేనియెడల మీ పరోక్షంలో తీర్మానించబడునని తెలియచేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేది: 17-5-2024

ఒంగోలు **ఇట్లు**
12-4-2024 **ఆళ్ళ హరిబాబు**
ఆళ్ళ రవిచంద్ర
అడ్వకేట్స్, ఒంగోలు
ఫోన్ నెం. 8886237590

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో : ఒంగోలు
O.S. 841/2023

Between:

చంద్రగిరి వెంకటేశ్వర్లు ...వాది

మరియు

శీలం హరిక్రిష్ణ ...ప్రతివాది

To,

శీలం హరిక్రిష్ణ, S/o. నాగేశ్వరరావు, గాంధీ నగర్, చీమకుర్తి టౌన్, ప్రకాశం జిల్లా.

పై నెంబరు గల దావాలో మీ హాజరు నిమిత్తం కోర్టు వారు అనేక పర్యాయములు నోటీసులు పంపినప్పటికీ మీరు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పై కోర్టు వారు పత్రిక ప్రకటన ద్వారా నోటీసులు జారీ చేసియున్నారు. కావున తమరు తేది: 08.05.2024న ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, లాయరు గారి ద్వారా కానీ హాజరు కావలసినది. లేని యెడల మీ పరోక్షంలో తీర్మానించబడునని తెలియచేయడమైనది.

వాయిదా తేది: 08-05-2024

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
ఆళ్ళ హరిబాబు,
ఆళ్ళ రవిచంద్ర
అడ్వకేట్స్, ఒంగోలు
ఫోన్ నెం: 8886237590

దావా సమను
మహారాజశ్రీ చీరాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. NO: 188 of 2020

బిట్వీన్ :

ముత్యాల చిదానందరావు ...వాది

Vs

నూతలపాటి జానకి రామయ్య ...ప్రతివాది

To

నూతలపాటి జానకి రామయ్య S/o వెంకటస్వామి
Door no: 17-3-11, కంకటపాలెం రోడ్డు
రామకృష్ణాపురం, బాపట్ల.

పై నంబర్ దావాను వాది మీపై ప్లెయింట్ పరిహారం నిమిత్తం దాఖలుచేసి ప్రతివాది అయిన మీకు ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపినను మీరు తీసుకొనక తప్పించుకొనుచున్నందున మీకు దావా సమన్లు జారీ నిమిత్తం ది: 24-4-2024 న తేదీకి వాయిదా వేసి వున్నారు. సదరు విషయమై మీకు ఏ విధమైన ఆక్షేపణ ఉన్న ఎడల సదరు వాయిదా రోజు ఉదయం 10:30 నిమిషములకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, న్యాయవాది గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మా నింపబడునని తెలియపరచడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ప్రకటన జారీ చేసినవారు //

పుల్లెల హరిబాబు
బి.ఎ.ఎల్ఎల్ బి
అడ్వకేట్ కొత్తపేట, చీరాల – 523157.
సెల్ : 9948320308

గెలిపిస్తే అభివృద్ధి చేస్తా: తాటిపర్తి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని వైసీపీ యర్రగొండపాలెం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం ఆయన వైసీపీ శ్రేణులతో కలిసి యర్రగొండపాలెం పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల కాలంలో ప్రజలకు చేసిన మేలును తెలిపారు. ఈ సందర్భంగా తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ యర్రగొండపాలెం నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని అన్నారు. పేదలు ఎక్కువగా వలసలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. తీగలేరు కాలువ ద్వారా సాగునీరు అందిస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి సౌకర్యాలు కల్పిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్, జడ్పి కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్ బాషా, వైసీపీ మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ రామావత్ అరుణాబాయి, నాయకులు కందూరి గురు, నర్రెడ్డి వెంకటరెడ్డి, సింగా ప్రసాద్, మేడగం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: వైసీపీ యర్రగొండపాలెం ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న తాటిపర్తి చంద్రశేఖర్‌ను గెలిపించాలని తాటిపర్తి చంద్రశేఖర్ అన్నయ్య తాటిపర్తి సుధాకర్ కోరారు.

ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న చంద్రశేఖర్

ఆదివారం వైసీపీ శ్రేణులతో కలిసి పెద్దదోర్నాల పట్టణంలో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గం వెనుకబాటుతనానికి గల కారణాలను వివరించారు. నియోజకవర్గ అభివృద్ధి జరగాలంటే వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. కేవలం నియోజకవర్గంలో సేవ చేసేందుకు జగనన్న తన తమ్ముడు చంద్రశేఖర్‌ను ఇక్కడికి పంపించారని కోరారు. ఆశీర్వదించి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, ఎంపిపి గుమ్మా పద్మజ యల్లేష్, సర్పంచ్ చిత్తూరి హారిక, నాయకులు మజీద్, గుమ్మా యల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులు: డిఎస్పీ

ప్రజాశక్తి-చీరాల

ఎలక్షన్ కమిషన్ సూచించిన ఎన్నికల నిబంధనలను అన్ని రాజకీయ పార్టీలు పాటించాలని, అందుకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ బేతపూడి ప్రసాద్ అన్నారు. ఆదివారం డిఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇటీవల పలు ప్రాంతాలలో నమోదైన కేసుల గురించి వివరించారు. నాయకులు, కార్యకర్తలు, ఆయా పార్టీల అభిమానులు అందరూ ఈసీ సూచనలను పాటించి సహకరించాలని ఆయన కోరారు. శాంతి భద్రతల విషయంలో ఏ రాజకీయ పార్టీనీ ఉపేక్షించేది లేదని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఈసీ నిబంధనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ విజయానికి సహకరించండి

మాజీ ఎమ్మెల్యే పోతులతో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి

ప్రజాశక్తి-టంగుటూరు

కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ విజయానికి సహకరించాలని నెల్లూరు పార్లమెంటు టిడిపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకం 'రెడ్డి మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావుకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం టంగుటూరులోని పోతుల రామారావు స్వగృహంలో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి కలిసి ఈ మేరకు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గంలో పార్లమెంట్ అభ్యర్థిగా తనకు, పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఇంటూరి నాగేశ్వరరావు గెలుపు కోసం సహకరించాలని కోరారు. వేమిరెడ్డి విజ్ఞప్తి పట్ల పోతుల రామారావు సానుకూలంగా స్పందించినట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

పోతుల మద్దతుపైనా ప్రజల్లో సందేహాలు

కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలుపునకు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు పూర్తిస్థాయిలో సహకరిస్తారా అన్న సందేహాలు ప్రజల్లో నెలకొన్నాయి. పోతుల రామారావు సన్నిహితులు పలువురు మాట్లాడుతూ కందుకూరు టిడిపి అభ్యర్థిని అధిష్టానం ప్రకటించే సమయంలో పోతులకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదన్నారు. అందువల్లనే ఆయన అధిష్టానం తీరుపై కొంత అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆదివారం ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి వినతిపైనా, దీనికి ముందు కందుకూరు అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ఈ నెల 23వ తేదీన తన నామినేషన్ ప్రక్రియకు హాజరు కావాలని పోతులకు చేసిన విజ్ఞప్తులకు పూర్తిస్థాయిలో అయినా స్పందిస్తారా లేదా అన్నదీ చూడాలి. దీనిపై వేమిరెడ్డి సన్నిహితులు సైతం కందుకూరు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు పార్టీ విధేయులుగా ఉన్నారని, తప్పకుండా తమ గెలుపునకు ఆయన సహకరిస్తారన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వెంట నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టంగుటూరు టిడిపి నాయకులు కామని నాగశ్రీను, చిడిపోతు వెంకటేశ్వర్లు, పమిడి తులసీరావు, చిడిపోతు కోటేశ్వరరావు, కసుకుర్తి శ్రీధర్ ఉన్నారు.

వైసీపీలో చేరిక

ప్రజాశక్తి-చిన్నగంజాం

మండల పరిధిలోని మసీదుపేట తెలుగుదేశం పార్టీకి చెందిన 25 కుటుంబాలు ఆ పార్టీని వీడి వైసిపి పర్చూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి యడం బాలాజీ సమక్షంలో ఆదివారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి యడం బాలాజీ సాదరంగా ఆహ్వానించారు. చినగంజాం మండల వైసిపి నాయకులు ఆసోది బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో వైసిపిలో చేరిన వారు షేక్ కరిముల్లా, షేక్ సలీం, సిహెచ్ కళ్యాణ్, చింతా సుబ్బారావు, మర్రి రాజశేఖర్, చక్రవర్తి, ఎం మాణిక్యరావు, మర్రి లాజరు, షేక్ నాగూర్, వైసిపిలో చేరిన సందర్భంగా వారు మాట్లాడుతూ పర్చూరు నియోజకవర్గంలో యడం బాలాజీని ఎమ్మెల్యేగా గెలిపించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తామని వారు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో చినగంజాం మండలం వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కుందురు నాగార్జునరెడ్డిని ఆదరించండి

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు టౌన్‌లో ఇంటింటి ప్రచారంలో కుందురు నాగార్జునరెడ్డి కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా గిద్దలూరు వైసీపీ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్యే అభ్యర్థి కుందురు నాగార్జునరెడ్డి, సతీమణి కల్పన, సోదరీలు పద్మ, అరుణ కొమరోలు పట్టణంలో ఇంటింటికీ తిరిగి గత ఐదు సంవత్సరాలుగా జగన్ ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా స్థానికంగా అందుబాటులో ఉంటున్నారని, కాబట్టి కుందురు నాగార్జునరెడ్డిని ఆదరించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గిద్దలూరు నియోజకవర్గ ప్రజలంతా మే 13న జరిగే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి కుందురు నాగార్జునరెడ్డి, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమరోలు మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేపు వైఎస్ షర్మిల చీరాల రాక

ప్రజాశక్తి-వేటపాలెం

ఈ నెల 23న చీరాల నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరపున తన నామినేషన్ దాఖలు కార్యక్రమంలో వైఎస్ షర్మిల పాల్గొంటున్నట్లు మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ తెలిపారు. ఆదివారం తన స్వగృహంలో ఆమంచి కృష్ణమోహన్ మీడియా సమావేశం నిర్వహించారు. వైఎస్ షర్మిల పర్యటన వివరాలను వెల్లడించారు. నామినేషన్ దాఖలు సందర్భంగా ఈ నెల 23న మంగళవారం పందిళ్లపల్లి నుంచి చీరాల వరకు భారీ ర్యాలీతో పాటుగా పట్టణంలో నిర్వహించనున్న బహిరంగసభలో ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పాల్గొంటారని తెలిపారు. కాబట్టి నియోజకవర్గంలోని ప్రజలు, అభిమానులు స్వచ్ఛందంగా షర్మిల పర్యటనను, నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రైస్‌లో ఇంజనీరింగ్ విద్యార్థుల ఫేర్‌వెల్ వేడుకలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

టంగుటూరు మండలం వల్లూరు సమీపంలోని రైజ్ కృష్ణ సాయి ప్రకాశం గ్రూపు ఆఫ్ ఇనిస్టిట్యూషన్‌లో ఆదివారం సివిల్ ఇంజిరింగ్ విద్యార్థులు వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారని కస్పాండెంట్ శిద్దా హనుమంతరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల చైర్మన్ ఇస్కాల చిన రంగమన్నారు హాజరయ్యి జ్యోతి ప్రజ్వలన చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సివిల్ బ్రాంచ్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో సివిల్ రంగానికి ఎన్నో అద్భుత అవకాశాలు ఉన్నాయని, వాటిని ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఏవి భాస్కరరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్‌లో సివిల్ కోర్సు పూర్తయిన తర్వాత విద్యార్థులకు మంచి అవకాశాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు డాన్సులతో అలరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి కే మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పలువురు వైసీపీలో చేరిక

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వైసీపీలో చేరుతున్న దృశ్యం

యర్రగొండపాలెం మండలంలోని వాదంపల్లి ఉప సర్పంచ్ మిరంపల్లి అంజి, కాపు నాయకులు నీలం పెద్ద సుబ్బయ్య ఆదివారం వైసీపీ పార్టీలో చేరారు. అలాగే యర్రగొండపాలెంనకు చెందిన జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యా కమిటీ మాజీ చైర్మన్ షేక్ మహబూబ్ బీ, షేక్ మొహమ్మద్ ఖాసీం, షేక్ ఖుద్దుస్, షేక్ ఇస్మాయిల్, షేక్ అబ్దుల్లా, షేక్ యాసిన్, షేక్ కరిముల్లా, షేక్ సమియుల్లా, షేక్ షెక్షా (గోల్డ్), షేక్ అబ్దుల్లా ,షేక్ నిసార్, షేక్ హన్ను తదితరులు వైసీపీలో చేరారు. వీరికి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చాలా మంది ఇతర పార్టీలను వీడి వైసీపీలోకి రావడం శుభ పరిణామమన్నారు. వారందరికీ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిపి చేదూరి విజయభాస్కర్, జడ్పి కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్ బాషా, వైసీపీ మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, నాయకులు పబ్బిశెట్టి శ్రీను, కందూరి గురు తదితరులు పాల్గొన్నారు.

పట్టుకున్న నిందితుడితో అటవీ శాఖ ఉద్యోగులు

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-గిద్దలూరు

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని దిగువమెట్ట డిప్యూటీ రేంజి అధికారి డి వంశీకృష్ణ వేటగాళ్లను హెచ్చరించారు. పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కణితిని వేటాడి చంపిన కేసులో ముద్దాయిగా ఉన్న మన్నెం రంగయ్య గత సంవత్సర కాలంగా పరారీలో ఉండగా, నిందితుడు నరుకుడు తిప్ప వద్ద అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నాడనే పక్కా సమాచారంతో వల పన్నారు.

డిప్యూటీ రేంజి అధికారి డి వంశీకృష్ణ తన సిబ్బందితో కలిసి అతి చాకచక్యంగా నిందితుడిని వెంటాడి పట్టుకున్నారు. అనంతరం నిందితుడిని గిద్దలూరు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా మే 3 వరకు రిమాండు విధించారు. నిందితుడిని గిద్దలూరు సబ్ జైలుకు తరలించినట్లు అటవీ డిప్యూటీ రేంజి అధికారి డి వంశీకృష్ణ తెలిపారు. ఈ దాడుల్లో అటవీశాఖ బీట్ అధికారులు ఎస్‌ఏ ఖయూమ్, ఎన్ క్రాంతి తేజ, డి లక్ష్మీ నాయక్, పీ సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలోని అంకమ్మ గూడేనికి చెందిన కుడుముల గురవమ్మ అనే గిరిజన వృద్ధురాలు ఆత్మహత్య చేసుకునేందుకు అటవీ ప్రాంతంలో దొరికే ప్రాణాంతకమైన ముష్టి ఆకును తెచ్చుకొని తిని అపస్మారక స్థితికి చేరింది. విషయం తెలుసుకున్న గిరిజనులు ఐటిడిఏ అంబులెన్స్ డ్రైవర్ నలగాటి వెంకట్రామయ్య నాయుడుకు సమాచారం చేరవేయడంతో అంబులెన్స్‌లో గురవమ్మను యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. కడుపులో ఉన్న ముష్టి ఆకును అంతా కక్కించారు. చికిత్సలు అందించారు. దీంతో ఆమె ప్రాణాపాయం నుంచి బయటపడింది. కేవలం కొడుకు పోలయ్య మందలించాడనే కారణంతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పేర్కొంది. దీంతో ప్రభుత్వ వైద్యులు గురవమ్మ కొడుకు పోలయ్యకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తల్లిని కొట్టడం, మందలించడం లాంటివి చేయకూడదని హితవు పలికారు.

మద్యం పట్టివేత

ప్రజాశక్తి-దర్శి: దర్శి పట్టణంలో ఆదివారం ఒక వ్యక్తి మోటార్ సైకిల్‌పై 133 మద్యం బాటిళ్లు అక్రమంగా తీసుకొని వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

13 మందికి గాయాలు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ఆటో అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో 13 మంది గాయపడిన ఘటన మార్టూరు సమీపంలోని నాగరాజుపల్లి వద్ద ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు ముస్లిం కాలనీకి చెందిన 13 మంది మహిళలు ఆదివారం ఉదయం చీరాలలో సముద్ర స్నానానికి వెళ్లారు. తిరిగి తమ స్వగ్రామం కొమ్మాలపాడు వెళుతుండగా మార్టూరు సమీపంలో ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలోని 13 మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సార్వత్రిక సమరం

నేడు హనిమిరెడ్డి నామినేషన్

ప్రజాశక్తి - అద్దంకి

పానెం హనిమిరెడ్డి

వైసీపీ అభ్యర్థిగా పలనాడు జిల్లాకు చెందిన పాణెం హనిమిరెడ్డి నేడు నామినేషన్ వేయనున్నట్లు ఆయన కార్యాలయవర్గాలు తెలిపారు. సింగర్‌కొండలో పూజలు నిర్వహించిన అనంతరం స్థానిక పార్టీ కార్యాలయం నుండి ర్యాలీగా తహాశీల్దారు కార్యాలయానికి చేరుకొని మధ్యాహ్నం 1:40కి నామినేషన్ దాఖలు చేసే విధంగా ఏర్పాట్లు చేసుకున్నారు. స్థానికేతరుడుగా, రాజకీయాలకు కొత్తయిన హనిమిరెడ్డి గత ఐదు నెలలుగా నియోజకవర్గంలోని గ్రామాలను కలయ తిరిగారు. అసంతృప్తులను సరిదిద్దుకున్నట్లు తెలిపారు. వైవి సుబ్బారెడ్డి సహకారంతో పార్టీలో ఉన్న అసమ్మతివాదులను తప్పించడంలో, పార్టీ ప్రారంభం నుండి ఉన్న నాయకులను కాపాడుకోవడంలో కేంద్రీకరించి పనిచేసినట్లు తెలిపారు. తన నామినేషన్ ర్యాలీకి తరలివచ్చి తనను ప్రోత్సహించాలని కోరారు.

అభివాదం చేస్తున్న నందిగం సురేష్, యడం బాలాజి

వైసిపిని మరోసారి ఆదరించండి

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

వైసిపిని మరోసారి ఆదరించాలని బాపట్ల ఎంపి అభ్యర్థి నందిగం సురేష్ కోరారు. పట్టణంలో ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఇంకొల్లులో రోడ్ షో నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు అందిన వారంతా తిరిగి తమకు ఓటేసి జగన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని కోరారు. పర్చూరు ఎంఎల్ఎ అభ్యర్థి యడం బాలాజి మాట్లాడుతూ అభివృద్ధి చెందాలంటే వైసిపికి ఓటేసి గెలిపించాలని కోరారు. మాజీ డిసిఎంఎస్ చైర్మన్ రావి రామనాథం బాబు మాట్లాడుతూ ప్రజలు కలిసి కట్టుగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి బండారు అనూష, సర్పంచ్ ఏజర్ల ప్రసన్న సైమన్ పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వారితో ఆనందబాబు

ఆనందబాబు సమక్షంలో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మండలంలోని చిన్న గాదెలవర్రు గ్రామానికి చెందిన 40 వైసీపీ కుటుంబాలు టిడిపి అభ్యర్థి, మాజీ మంత్రి నక్క ఆనందబాబు సమక్షంలో టిడిపిలో చేరారు. వీరికి టిడిపి కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. వైసిపి పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని అన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఉన్న పరిస్థితుల్లో రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని భావించి టిడిపిలో పనిచేసేందుకు సిద్ధపడి టిడిపిలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. తద్వారా రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని ఆశాభావ వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

పర్చూరు తొలి ఎంఎల్ఎ కొల్లా రామయ్య తనయుడు, మాజీ జడ్పిటిసి కొల్లా సుభాష్ టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఇసుకదర్శిలోని ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు సమక్షంలో టిడిపిలో చేరారు. సుభాష్‌కు టిడిపి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయనతోపాటు నాగులపాలెం చెందిన పలువురు వైసీపీ నేతలు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఏలూరి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే టిడిపి లక్ష్యమని అన్నారు. వైసీపీ శ్రేణులంతా టిడిపిలోకి రావాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమం, రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రజలంతా టిడిపికి మద్దతుగా నిలవాలని కోరారు. రాష్ట్రంలో ప్రజా కూటమి విజయం తథ్యమన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రానికి పూర్వ వైభవం వస్తుందని అన్నారు. విచ్ఛిన్నమైన వ్యవస్థలన్నీ గాడిలో పడాలంటే చంద్రబాబు సీఎం కావాలని అన్నారు. అరాచక పాలనకు ముగింపు పడుతుందన్నారు.

ఎంఎల్ఎ ఏలూరి సమక్షంలో టిడిపిలో చేరిన కొల్లా సుభాష్

నేడు నామినేషన్ సందర్భంగా ర్యాలీ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, పర్చూరు టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి ఏలూరి సాంబశిరావు నేడు పర్చూరు ఎన్నికల అధికారి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయన్నుట్లు తెలిపారు. చంద్రబాబు చేతుల మీదుగా బి ఫారం అందుకున్నారు. ఇసుక దర్శిలోని తన క్యాంపు కార్యాలయం నుండి ర్యాలీగా మార్టూరు, గన్నవరం రోడ్డులోని వినాయక స్వామి ఆలయం, యనమదల అంజనేయ స్వామి విగ్రహం వద్ద, యద్దనపూడి, పెద్ద జాగర్లమూడి మహంకాళి ఆలయంలో పూజలు, పెద్దివారి పాలెం చర్చిలో ప్రార్థనలు చేస్తారని తెలిపారు. పర్చూరు బొమ్మల సెంటర్లో బహిరంగ సభలో మాట్లాడి అనంతరం నామినేషన్ దాఖలు చేస్తారని తెలిపారు.

జగన్‌పై నమ్మకమే వైసీపీకి విజయం

ప్రజాశక్తి - బాపట్ల

ప్రజలకు జగన్‌పై ఉన్న నమ్మకమే వైసీపీని గెలిపిస్తుందని వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి కోన రఘుపతి అన్నారు. తన ఛాంబర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నమ్మకానికి, అపనమ్మకానికి మధ్య జరుగుతున్న ప్రజా తీర్పు అన్నారు. నిలువెత్తు అపనమ్మకానికి చంద్రబాబు నిదర్శనమని ఆరోపించారు. మానిఫెస్టో అంటే దాని నిర్వచనం, పవిత్ర గ్రంథమని మార్చిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నిలబెట్టుకున్న జగన్‌కు ఉన్న ప్రజాదరణ చూసి విపక్షాలు బురద జల్లుతున్నాయని అన్నారు. 24న వైసిపి ప్రకటించే నూతన మ్యానిఫెస్టో మరింత ప్రజా రంజకంగా ఉంటుందని అన్నారు. నియోజకవర్గంలో కొత్తగా 38సచివాలయాలు 28ఆర్‌బికెలు నిర్మించినట్లు తెలిపారు. సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థ రూపకల్పన ప్రజా రంజక పాలనకు నాంది పలికినట్లు తెలిపారు. విద్యా వ్యవస్థను పూర్తిస్థాయిలో బలోపేతం చేసినట్లు చెప్పారు. పెట్టుబడిదారుల ఆలోచనలను అనుసరించే మార్గాలను అనుసరిస్తూ పెత్తందార్లకి మద్దతుగా చంద్రబాబు పనిచేస్తున్నారని అన్నారు. పేదల పక్షాన నిలిచి, ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం చెబుతున్న జగన్మోహన్‌రెడ్డికి ఎన్నికల్లో మద్దతు పలకాలని కోరారు. తన నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎఎంసి చైర్మన్ డి సీతారామిరెడ్డి, జోగి రాజా, కోకి రాఘవరెడ్డి, మండే విజయ్ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ కోన రఘుపతి

23న బాలాజీ నామినేషన్

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

యడం బాలాజి

పర్చూరు వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి యడం బాలాజీ ఈ నెల 23న నామినేషన్ దాఖలు చేస్తారని అయన కార్యాలయ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. చీరాలలో బాలాజీ స్వగృహం నుండి ఉదయం 8 గంటలకు కార్యకర్తలు, అభిమానులతో ర్యాలీగా బయలుదేరి కారంచేడు, నాగులపాలెం మీదుగా పర్చూరు చేరుకొని స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఎన్నికల అధికారికి నామినేషన్ దాఖలు చేస్తారని తెలిపారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలిని కోరారు.

ఎన్నికల ప్రచారంలో అశోక్ బాబు

నిరుద్యోగుల్ని మోసం చేసిన జగన్

ప్రజాశక్తి - సంతమాగులూరు

ప్రతి ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ అంటూ అబద్ధాలు పలికిన సిఎం జగన్ నిరుద్యోగుల్ని మోసం చేశాడని టిడిపి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ ఆరోపించారు. మండలంలోని మిన్నేకల్లు గ్రామంలో తన తండ్రి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా ఇంటింటా ఎన్నికల ప్రచారం ఆదివారం నిర్వహించారు. టిడిపి సూపర్ సిక్స్ పథకాల అమలుపట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు లేక, రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు రాక, స్వయం ఉపాధికి ప్రభుత్వం నుంచి సహకారం లేక యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. ఉపాధి, ఉద్యోగాలు లేక రాష్ట్రంలో గత మూడేళ్లలో 21,575 మంది యువత ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నట్లు పార్లమెంట్ సాక్షిగా కేంద్రమంత్రి వెల్లడించారని అన్నారు. ఇది వైసీపీ పాలనకు నిదర్శనం అన్నారు. గత ఎన్నికల ముందు అనేక మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్ల కాలంలో ప్రజలపై అనేక భారాలు మోపి ఇబ్బందులకు గురి చేసిందని అన్నారు. నవరత్నాల పేరుతో జనాన్ని వంచించారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తేలప్రోలు రమేష్, చేవూరి వాసురెడ్డి, ధూపాటి ఏసోబు, మాదాల సుబ్బారావు, కొనికి గోవిందమ్మ, గుమ్మా జ్యోతి, వసంత వేణుబాబు, హరిబాబు, రామకోటేశ్వరరావు, పూర్ణయ్య పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో గొట్టిపాటి హర్షవర్ధన్

అశోక్ బాబు విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - వేమూరు

వైసిపి అభ్యర్థి వరికూటి అశోక్ బాబు మండలంలోని వరాహపురం గ్రామంలో ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. వేమూరు నుండి వరాహపురం వరకు తన అనుచరులు, నాయకులు, కార్యకర్తలు ర్యాలీ చేశారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పనిచేస్తున్న సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైసీపీ జెండాను ఎగుర వేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. తనతోపాటు బాపట్ల ఎంపి అభ్యర్థిగా నందిగం సురేష్‌ను గెలిపించాలని కోరారు.

పేదల కోసమే వైసిపి సంక్షేమం

ప్రజాశక్తి - మేదరమెట్ల

పేదవాడు బాగుండాలంటే మరల వైసిపి ప్రభుత్వం అధికారంలోనికి రావాలని వైసిపి నాయకులు, మాజీ ఎఎంసి చైర్మన్ వైవి భద్రరెడ్డి అన్నారు. ఎన్నికల నేపథ్యంలో మేదరమెట్లలో ఆయన ఆదివారం ప్రచారం నిర్వహించారు. వైసిపిని గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. గడిచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ఇంటింటికీ తిరిగి వైసిపి బలపరుస్తున్న అభ్యర్థి పాణ్యం హనిమిరెడ్డిని గెలిపించాలని కోరారు. సర్పంచ్ బొనిగల ఎలిసెమ్మ, మాజీ సర్పంచ్ పేరం నాగలక్ష్మి, కోయి అంకారావు, హనుమంతరావు, ఎర్రం రత్నారెడ్డి, ఎర్రం నాగిరెడ్డి పాల్గొన్నారు.

నేడు సైదా నామినేషన్

ప్రజాశక్తి - మార్కాపురం

కాంగ్రెస్ అభ్యర్థి షేక్ సైదా

ఇండియా కూటమి బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి షేక్ సైదా నేడు నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి కాంగ్రెస్ అభిమానులు, సిపిఎం, సిపిఐ, ఆమ్ ఆఫ్ ది పార్టీ నాయకులు కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

సార్వత్రిక సమరం

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం : బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి

ఆర్యవైశ్యులకు సముచిత స్థానము కల్పించి అండగా ఉంటామని వైసిపి దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక శ్రీనివాస పద్మావతి కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు వల్ల భాస్కర్ అధ్యక్షతన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు అన్ని విధాల అండగా ఉంటామన్నారు. అన్ని విషయాల్లో చేదోడు వాదోడుగా ఉంటామని తెలిపారు. రేషన్ డీలర్ల నియామకంలో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో దర్శి ఎమ్మెల్యేగా తనను, వైసిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర చైర్మన్ కుప్పం ప్రసాద్ మాట్లాడుతూ వైసిపితోనే ఆర్యవైశ్యులకు అన్ని విధాల న్యాయం జరుగుతుందన్నారు. చంద్రబాబునాయుడు కల్లబొల్లి మాటలు చెప్పడం తప్ప ఆర్యవైశ్యులకు చేసింది ఏమి చేయలేదన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో దర్శి ఎమ్మెల్యేగా శివప్రసాద్‌రెడ్డి గెలిపించాలన్నారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు దేవకి వెంకటేశ్వర్లు, యువజన నాయకులు హరీష్, ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు సూరే చిన్నసుబ్బారావు మాట్లాడారు. అనంతరం బూచేపల్లి కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి నందిని , వైసిపి పట్టణ అధ్యక్షుడు సురేష్, సుబ్బారావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు మునగా ఆంజనేయులు, మునగా నాగేశ్వరరావు, పానుగంటి కోటేశ్వరరావు, రజిని, ఇందిరా, సుజాత, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

6వ వార్డులో ఇంటింటి ప్రచారం...

దర్శి పట్టణంలోని 6వ వార్డులో వైసిపి దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరగాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. అనంతరం ముండ్లమూరు మండలం రావిపాడు, తమ్మలూరు, కొమ్మారం, బొప్పిడివారిపాలెం, అయోధ్యనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లూరు మండలం తూర్పుగంగవరం గ్రామానికి పలువురు వైసిపిలో వచ్చారు. శివప్రసాద్ రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ వెన్నపూస నారాయణమ్మ, నారాయణరెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షుడు కట్టేకోటి హరీష్, వైసిపి మండల అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు కుమ్మిత అంజిరెడ్డి, స్థానికొమ్ము తిరుపతిరెడ్డి, నాయకులు కెవి.రెడ్డి, సద్ది పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వారితో ఎమ్మెల్యే స్వామి

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-శింగరాయకొండ

మర్రిపూడి మండలం కూచిపూడి గ్రామంలో టిడిపి కొండపి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెరికి ఆశీర్వాదం, మరో నాలుగు కుటుంబాల వారు టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే స్వామి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం స్వామి మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలోనే అభివద్ధి జరిగిందని, వైసీపీ ప్రభుత్వంలో ఎలాంటి అభివద్ధి జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నరసారెడ్డి, వీరనారాయణ, నరసింహ, యర్రమోతు శ్రీనివాస్, హనుమరెడ్డి, కొండారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దామచర్ల సత్య పరామర్శ

దర్శి నుంచి ఒంగోలు వస్తూ ప్రమాదవశాత్తు గాయపడిన దర్శి నియోజకవర్గ టిడిపి పరిశీలకులు నాదెండ్ల బ్రహ్మంను టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి దామచర్ల సత్య ఆదివారం రాత్రి పరామర్శించారు.

బి ఫారం అందుకున్న కొండారెడ్డి

ప్రజాశక్తి-దర్శి

కాంగ్రెస్ పార్టీద దర్శి నియోజకవర్గ అభ్యర్థిగా పుట్లూరు కొండారెడ్డి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్. షర్మిల చేతుల మీదుగా ఆదివారం బిఫారం అందుకున్నారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మట్లాడుతూ తనమీద నమ్మకంతో బిఫారం అందజేసిన పిసిసి అధ్యక్షురాలు వైఎస్. షర్మిలకు కతజ్ఞతలు తెలిపారు. దర్శి నియోజకవర్గ ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలన్నారు.

బి ఫారం అందుకుంటున్న కొండారెడ్డి

టిడిపితోనే పేదల సంక్షేమం : గొట్టిపాటి

ప్రజాశక్తి-దర్శి

టిడిపితోనే పేదల సంక్షేమం సాధ్యమని టిడిపి దర్శి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. దర్శి పట్టణంలోని 6, 7వ వార్డుల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ తనను ఆదర్శిస్తే దర్శి నియోజకవర్గానికి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో దర్శి ఎమ్మెల్యేగా తనను, టిడిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టిడిపి పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, రాష్ట్ర మహిళా నాయకులు శోభారాణి, దారం సుబ్బారావు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ గొట్టిపాట్టి లక్ష్మి

నేడు బాలినేని శ్రీనివాసరెడ్డి నామినేషన్

ప్రజాశక్తి- ఒంగోలు సబర్బన్

వైసిపి ఒంగోలు నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈసందర్భంగా నగరంలో భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని పలు నియోజకవర్గాల నుంచి వైసిపి నాయకులు, బాలినేని శ్రీనివాసరెడ్డి అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఒంగోలు నియోజకవర్గం నుంచి భారీగా జన సమీకరణ జరుగుతోంది. సుమారు 50 వేలకు పైగా ప్రజలు ప్రదర్శనలో పాల్గొనేలా దృష్టి సారించారు. ఈపాటికే వైసిపి కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, సచివాలయ గృహసారథులు డివిజన్‌లలో పర్యటించి బాలినేని శ్రీనివాసరెడ్డి నామినేషన్‌కు తరలిరావాలని ప్రజలను ఆహ్వానించారు. బాలినేని శ్రీనివాసరెడ్డి అనుచరులు కూడా వైసిపి బలంగా ఉన్న కాలనీల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. జనసమీకరణ బాధ్యతను ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన కుమారుడు ప్రణీత్‌రెడ్డి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఉదయం 9 గంటలకు కర్నూలు రోడ్డు ఫ్లైఓవర్ వద్ద నుంచి ర్యాలీ ప్రారంభం కానుంది. చర్చి సెంటర్ వరకు ర్యాలీ కొనసాగనుంది. ర్యాలీలో సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పు వాయిద్యాలు సందడి చేయ నున్నాయి. వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకొని కార్యక్రమాన్ని మధ్యాహ్నం లోపే ముగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల లోపు బాలినేని శ్రీనివాసరెడ్డి నామినేషన్ వేస్తారని ఆపార్టీ నాయకులు చెప్పారు. నగరంలోని అన్నీ డివిజన్‌ల నుంచి డివిజన్‌కు కనీసం వెయ్యి మందికి తగ్గకుండా నామినేషన్ ర్యాలీలో ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొత్తపట్నం మండలం, ఒంగోలు రూరల్ ప్రాంతాల నుంచి కూడా భారీగా జన సమీకరణ జరుగు తోంది. నామినేషన్ కార్యక్రమంలో వైసిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి బాస్కర్‌రెడ్డి, జిల్లాలోని పలు నియోజకవర్గాల నుంచి వైసిపి అభ్యర్థులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొంటారని సమాచారం.

నేడు సురేష్ నామినేషన్

ప్రజాశక్తి-శింగరాయకొండ

వైసిపి కొండపి నియోజక వర్గ అభ్యర్థి, రాష్ట్ర మున్సిపల్ పట్టణా భివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. శింగరాయకొండలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద నుంచి భారీ ర్యాలీగా టంగుటూరు మీదుగా కొండపి తహశీల్దారు కార్యాలయానికి చేరుకుంటారు. అనంతరం నామినేషన్ పత్రాలు అందజేశారు. సురేష్ తరపున ఈ పాటికే రెండు సెట్లు నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం కొండపిలో బహిరంగ సభ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆదిమూలపు సురేష్ కోరారు.

కొండపి: వైసిపి కొండపి నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. అందులో భాగంగా శింగరాయకొండ నుంచి టంగుటూరు మీదుగా కొండపి వరకూ భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వైసిపి నాయకులు తెలిపారు. నామినేషన్ అనంతరం కొండపిలోని టంగుటూరు రోడ్డులో పొగాకు బోర్డు, బారత్ పెట్రోల్ బంకు మధ్య బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభలో 25 వేల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. నామినేషన్ కార్యక్రమంలో ఆరు మండలాల వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

25న దద్దాల నామినేషన్

ప్రజాశక్తి -కనిగిరి

వైసిపి కనిగిరి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఈనెల 25న నామినేషన్ దాఖలు చేయనున్నారు. దద్దాల నారాయణ యాదవ్ నామినేషన్ ప్రక్రియ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు విస్తతంగా ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు. ఆరు మండలాల నాయకులు,కార్యకర్తలు నామినేషన్ తేదీని ప్రజలకు తెలియజేశారు. దీంతో నామినేషన్ సందర్భంగా కనిగిరిలో నిర్వహిస్తున్న భారీ ర్యాలీ, నామినేషన్ ప్రక్రియలో భాగస్వామ్యం అయ్యేందుకు అందరూ సిద్ధమవుతున్నారు. వేలాది మందితో దద్దాల నారాయణ యాదవ్ ర్యాలీగా వెళ్లి ఆర్‌డిఒ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు.

నేడు లక్ష్మి నామినేషన్

ప్రజాశక్తి-దర్శి

టిడిపి దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సోమవారం దాఖలు చేయనున్నారు. స్థానిక టిడిపి కార్యాలయం నుంచి గడియార స్తంభం సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని టిడిపి నాయకులు కోరారు.

వివాహ వేడుకల్లో దద్దాల

ప్రజాశక్తి-పిసిపల్లి

మండల పరిధిలోని గుంటుపల్లి గ్రామంలో నరాల వారి వివాహ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో వైసిపి కనిగిరి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని నూతన దంపతులు వెంకట నరేంద్రరెడ్డి, చరితారెడ్డిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి - పొదిలి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. పట్టణంలోని మార్కాపురం అడ్డరోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లో అధికారులు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరిశీలిస్తున్నారు. ఎన్నికల్లో మద్యం, నగదు ఇతర ప్రాంతాలకు చేర వేయకుండా ఉండేందుకు అధికారులు కట్టుదిట్ట చర్యలు చేపట్టారు. వాహనాల తనిఖీల్లో తహశీల్దారు మహమ్మద్ జియా, సిఐ మల్లికార్జునరావు, ఎస్ఐ జి కోటయ్య, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి, ఆర్ఐ కిలారి సుబ్బారావు పాల్గొన్నారు.

టిడిపి పథకాలను వివరిస్తున్న విఘ్నేష్‌రెడ్డి

తలమలలో విఘ్నేష్‌రెడ్డి ప్రచారం

ప్రజాశక్తి - పొదిలి

మే 13న జరుగనున్న ఎన్నికల్లో ఒంగోలు ఎంపి అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులురెడ్డి, మార్కాపురం ఎంఎల్ఎ అభ్యర్థి కందుల నారాయణరెడ్డిని గెలిపించాలని కోరుతూ కందుల విఘ్నేష్‌రెడ్డి ఆదివారం ప్రచారం నిర్వహించారు. మండలం లోని తలమల్ల పంచాయతీలో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో అనూష, సౌజన్య

వదిన, మరదళ్ల ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - పొదిలి

వైసిపి అభ్యర్థుల గెలుపు కోరుతూ వదిన, మరదలు ఎన్నికల ప్రచారం ఆదివారం చేశారు. మార్కాపురం వైసిపి అభ్యర్థి అన్నా వెంకట్ రాంబాబు కోడలు అనూష, కుమార్తె సౌజన్య పట్టణంలోని 8, 9వార్డుల్లో ఎన్జీఓస్ కాలనీ, పుల్లరేపేట, నవాబుమిట్ట ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. ఒంగోలు ఎంపిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మార్కాపురం ఎంఎల్ఎగా అన్న వెంకట రాంబాబును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పొదిలి నగర పంచాయతీ అధ్యక్షురాలు ఎస్‌కె నూర్జహాన్ బేగం, వైసిపి మహిళా నాయకులు దోర్నాల వరలక్ష్మమ్మ పాల్గొన్నారు.

వెంకటేశ్వర కల్యాణోత్సవం

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని ఉప్పుటూరు శ్రీ వెంకటేశ్వర స్వామికి శ్రీ శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామికి కల్యాణ మహోత్సవం సోమవారం జరుగునని ఆలయ కమిటీ ఛైర్మన్ బెండపూడి రాధాకృష్ణమూర్తి తెలిపారు. 23న మంగళవారం రథోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు, కోలాటం, భక్తి గీతాలాపన ఉంటాయని ఆలయ ఈఓ తిరుమలశెట్టి శిరీష తెలిపారు.

శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన చర్యలు

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

ప్రజాశక్తి - మార్కాపురం

పట్టణంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యాయి. సోమవారం తెల్లవారు జామున కళ్యాణం జరగనుంది. వచ్చేనెల 5 వరకు ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. మే 1న రథో త్సవ వేడుక కనుల పండుగగా నిర్వహిస్తారు. ఈ వేడుక తిలకించేందుకు పట్టణంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు వేలాదిగా తరలి రానున్నారు. ఈ నేపథ్యంలో ప్రజ లకు సౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. తన కార్యాలయంలో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఎన్నికల సమయం కావడంతో వేడుకల్లో రాజకీయ నేతల పాత్ర ఉండరాదని అన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహిం చాలని అన్నారు. శానిటేషన్ ఎప్పటికప్పుడు మెరుగు పర్చాలని అన్నారు. పోలీస్, మున్సిపల్, రెవిన్యూ, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో డిఎస్పి ఎం బాలసుందర్రావు, సిఐ ఆవుల వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ఈ కిరణ్, ఆలయ ఇఒ గొలమారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీలో చేరిక

- కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే ఏలూరి

టిడిపిలోకి ఆహ్వానిస్తున్న ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి - పర్చూరు

ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు సమక్షంలో యద్దనపూడి మండలం పెద్ద జాగర్లమూడి, మార్టూరు మండలం మార్టూరు వలపర్ల, బొల్లాపల్లి, మార్టూరు హనుమంతరావు కాలనీకి చెందిన పలువురు టిడిపిలో ఆదివారం చేరారు. వారికి టిడిపి కండువలు మెడలో వేసి ఆహ్వానించారు. బొల్లాపల్లికి చెందిన వైసిపికి చెందిన సీనియర్ నేత, సొసైటీ అధ్యక్షుడు పోపూరి శ్రీమ న్నారాయణ ఆధ్వర్యంలో పల్లపు సుబ్బారావు, రామాంజ నేయులు, గోరంట్ల వెంకట్రావు, వల్లపు అంకారావు, వల్లపు అంకమ్మరావు, గోగులపాటి శ్రీనివాసరావు, కోపూరు వెంకట్రావు, వలపర్లకు చెందిన బూరగా శ్యామ్ కుమార్, పులిపాటి ధనమంత్రి, బూరగ రవీంద్ర, బూరగ లీలాంబరం, ఎం చిన్న, యోహాను, ఎం అజయ్, మూకిరి ఆదాం, సునీల్, జాగర్లమూడికి చెందిన షేక్ మస్తాన్ వలి, షేక్ అన్వర్, షేక్ హజారాబి, షేక్ చిన్న నాగూర్, షేక్ పెద్ద నాగూర్, షేక్ చీరాల బాజీ, షేక్ సలాం, షేక్ మషకూర్ అలీ, షేక్ గౌస్, షేక్ బాజీ, మార్టూరు హనుమంతరావు కాలనీ చెందిన షేక్ రెహమాన్ ఆధ్వర్యంలో గుంటూరు లక్ష్మి, సువర్ణ కుమారి, షేక్ మస్తాన్, బి శివ నాగమల్లేశ్వరి కుమారి, అత్తర్ బి, రాజమ్మ, సుబ్బాయమ్మ, ధనలక్ష్మి, జిలాని, సుబ్బారావు, అంజనాదేవి, అమీన పాల్గొన్నారు.

ఓటు హక్కుతో మంచి నాయకుడ్ని ఎన్నుకోండి

ఓటరు చైతన్య గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

ప్రజాశక్తి - పొదిలి

ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని మంచి నాయకులను ఎన్నుకోవాలని కళాకారులు సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశంతో కలెక్టర్ సారథ్యంలో ఓటర్లను చైతన్య చేసే కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక పెద్ద బస్టాండ్ సెంటర్లో మేలుకొలుపు కళా విభాగం కళాకారులు ప్రజాచైతన్య కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కళాకారులు వివిధ రకాల నాటికలు, పాటల ద్వారా ఓటు హక్కు వినియోగం, దాని సద్వినియోగం చేసుకోవడం వల్ల కలిగే లాభాలు వివరించారు. సామాజిక హితం చేసే మంచి నాయ కులను ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాకారులు సిహెచ్ వెంకటేశ్వర్లు, సిహెచ్ నాసర్ బాబు, ఎన్ శ్రీనివాసరావు, జి ఏడుకొండలు, పి వెంకటశివ, పి రాజా, ఎస్‌కె కరీముల్లా, ఎస్‌కె భాష, ఎ సుందరి, టి ఆశాజ్యోతి పాల్గొన్నారు.

'బైక్ సైలెన్సర్ల'పై పోలీసుల ప్రత్యేక డ్రైవ్

బైకులకు తొలగించిన సైలెన్సర్లతో పోలీసులు

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

ద్విచక్ర వాహనాలకు మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చిన వారిపై పట్టణ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ షేక్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. డిఎస్పి పి బాలసుందర్రావు ఆదేశాల మేరకు మోడిఫైడ్ సైలెన్సర్లతో బైకులు నడిపే వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కొందరు యువత ద్విచక్ర వాహనాలకు సంబంధిత కంపెనీ ఇచ్చిన సైలెన్సర్లను మార్చుచేసి అధిక శబ్దం వచ్చే వాటిని అమర్చుతున్నారని, దీనివల్ల విపరీతమైన ధ్వని కాలుష్యం ఏర్పడడంతో పాటు పట్టణ ప్రజలు భయభ్రాంతులు కలిగేలా రోడ్లపై అకస్మాత్తుగా వింత శబ్దాలు చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పోలీసులకు ఫిర్యాదు వస్తున్నాయని అన్నారు. మరి కొందరు వాహనాల హారన్లను సైతం అదే తరహాలో అమర్చుతున్నారని అన్నారు. అటువంటి వారి ఆట కట్టించేందుకు పోలీసు దృష్టి సారించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలకు సిద్ధమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అల్లావుద్దీన్, నాగరాజు, డి సుభాని, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అన్నా రాంబాబు నామినేషన్

అన్న రాంబాబు

ప్రజాశక్తి - మార్కాపురం

వైసిపి అభ్యర్థి అన్నా వెంకట రాంబాబు నేడు నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా పట్టణం లో ర్యాలి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నామినేషన్‌కు వైసిపి ఎంపి అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఎపిఐఐసి ఛైర్మన్ జంకె వెంకటరెడ్డి హాజరవుతారని తెలిపారు. నేడు ఉదయం 10 గంటలకు స్థానిక జవహర్ నగర్ కాలనీలోని తన ఇంటి నుండి ప్రదర్శన ప్రారంభం అవుతుందని తెలిపారు. పట్టణ ప్రధాన రహదారుల మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటామని తెలిపారు. వైసిపి కార్యకర్తలు, నాయకులు తరలి రావాలని కోరారు.

సమావేశంలో కనపర్తి రవికిరణ్

వైసిపి అభ్యర్థి గణేష్ నామినేషన్

ప్రజాశక్తి - రేపల్లె

సిఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు సారధ్యంలో వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి డాక్టర్ గణేష్ నామినేషన్ జయప్రదం చేయాలని పేటేరు వైసిపి ఇన్చార్జ్ కనపర్తి రవికిరణ్ కోరారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు ఉదయం 8:30 గంటలకు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు కార్యాలయానికి చేరుకుంటారని చెప్పారు. అక్కడి నుండి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన కార్యకర్తలతో డాక్టర్ గణేష్ రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకొని నామినేషన్ దాఖలు చేస్తారని చెప్పారు.

వివాహ వేడుకల్లో ఏలూరి

ప్రజాశక్తి - ఇంకొల్లు

గ్రామానికి చెందిన విత్తన వ్యాపారి మాగులూరి సాంబశివరావు కుమారుడికి వివాహ వేడుకల్లో ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు ఆదివారం రాత్రి పాల్గొన్నారు. ఇంకొల్లు మాజీ సర్పంచి, ఎఎంసి ఛైర్మన్, ప్రముఖ నాయకులు కొల్లూరి నాయుడమ్మ మనవరాలుకి ఇంకొల్లు - కడవకుదురు రోడ్డులోని ఫంక్షన్ హాలులో వివాహం జరిగింది. కొల్లూరి నాయుడమ్మతోపాటు మాగులూరి సాంబశివరావు కుటుంబానికి రాజకీయ నేపథ్యం తోపాటు పలువురు ప్రముఖులు పరిచయం ఉండటంతో మండలంలోని వివిధ గ్రామాలతో పాటు ప్రముఖులు వచ్చి వధువు, వరులను ఆశీర్వదించారు.

టిడిపిలో చేరిన మాజీ ఉపసర్పంచి జిలాని

కందుల సమక్షంలో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - పొదిలి

పొదిలి మాజీ వైస్ సర్పంచ్ షేక్ జిలాని మార్కాపురం నియోజకవర్గ టిడిపి కూటమి ఎంఎల్ఎ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి సమక్షంలో ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయం వద్ద టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈసందర్భంగా టిడిపి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైసిపి అరాచక ప్రభుత్వానికి చరమ గీతం పాడాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమం కోసం టిడిపిని గెలిపించాలని కోరారు. చంద్రబాబు సిఎం అయితేనే రాష్ట్ర అభివృద్ధి, పరిపాలన గాడిలో పడుతుందని అన్నారు.

రోడ్డు పక్కన చెత్తతో దుర్గంధం

◆ డంపింగ్ యార్డులు లేని పంచాయతీలు ◆ పర్యావరణానికి తూట్లు పొడుస్తున్న వైనం

ప్రజాశక్తి - బాపట్ల

చెత్త నుండి సంపద సృష్టించాల్సిన పంచాయతీలు అందుకు తిలోదకాలు ఇస్తున్నాయి. గ్రామాల్లో ఇంటింటి నుండి సేకరించిన చెత్తను రహదారి మార్జిన్లకు తరలిస్తున్నారు. రోడ్డు పక్కన పెరిగిన చెత్తను దహనం చేస్తున్నారు. ఆ చెత్త దహనం నుండి వస్తునన పొగ, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పర్యావరణ పరిరక్షణకు తూట్లు పొడుస్తున్నారు. దగ్ధమౌతున్న చెత్త నుండి వెలువడుతున్న ఘాటైన పొగధాటికి రహదారులు వెంట ప్రయాణించే ప్రజలు బేజారవుతున్నారు. దీన్ని నిలువరించాల్సిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. గత వారం రోజులుగా బాపట్ల, అప్పికట్ల రహదారిలో అప్పికట్ల గ్రామంలో ఇంటింటి నుండి సేకరించిన చెత్తను రహదారి మార్జిన్లో పోసి దహనం చేయడంతో వారం రోజులుగా రావణకాష్టంలా రగులుతూ ఉంది. ఆ ప్రాంతంలో అలుముకుంటున్న పొగ విషవాయులను వెదజల్లుతోంది. రహదారి మార్జిన్లో దహనమవుతున్న చెత్తతో ఆ ప్రాంతంలో రాత్రి వేళల్లో పొగ దెబ్బకు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వాహన చోదకులు భయపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీల పరిధిలోని శివారు గ్రామాల గృహాల నుండి సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా విడదీసి చెత్త నుండి సంపద సృష్టించాలనే లక్ష్యంతో సంపద సృష్టి కేంద్రాలను నిర్మించారు. అయితే గ్రామ పంచాయతీలు, అధికారులు వాటి నిర్వహణను గాలికి వదిలేశారు. అయితే బాపట్ల, అప్పికట్ల మార్గంలో అనేకమంది అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రతినిత్యం రాకపోకలు కొనసాగిస్తూ ఉంటారు. రహదారి వెంట విషవాయువులతో గుప్పిస్తున్న పొగను మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకంగా చెత్త

రోడ్డుపక్కన దగ్ధమవుతున్న చెత్త నుండి వెలబడుతున్న పొగ

దహనాన్ని నిలువరించి చెత్త నుండి సంపద సృష్టించి పంచాయతీలకు ఆదాయ వనరులు సమ కూర్చడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు. అయితే బాపట్ల మండలంలో ఒకటి రెండు పంచాయతీల్లో మాత్రమే చెత్త సేకరణ నిర్వహణ జరుగుతోంది. మిగిలిన పంచాయతీల్లో దాదాపు ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

ఎన్నికల ప్రచారంలో ఎంఎల్ఎ స్వామి

ఎంఎల్ఎ డోలా ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - పొదిలి

మర్రిపూడి మండలంలోని కూచిపూడి గ్రామ నివాసి, ఆర్ఎంపి వైద్యులు డాక్టర్ గూడాలి గౌరీ శంకర్ శర్మ కూచిపూడిలో సుదీర్ఘ ప్రాంతాల్లో ప్రైవేటు వైద్యునిగా మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారని ఎంఎల్ఎ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. గౌరీ శంకర్ శర్మ కాంగ్రెస్‌లో ప్రత్యక్ష, పరోక్ష రాజకీయాల్లో కీలక నేతగా వ్యవహరించిన నాయకుడు, శర్మ ఇంకా చెప్పాలంటే వైసిపిలో కరుడుగట్టిన నాయకుడని కూడా చెబుతున్నారు. అలాంటి నాయకుడు ఇటీవల కాలంలో మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నాయకత్వంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆయన ప్రవేశపెట్టిన పథకాలపై ఆకర్షితులై కొండపి ఎంఎల్ఎ డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఆధ్వర్యంలో టిడిపి కండువా కప్పుకున్నారు. ఆదివారం రాత్రి జరిగిన టిడిపి కార్యక్రమంలో కొండేపి శాసనసభ్యులు స్వామి తన స్వగ్రామైన కూచిపూడి సభలో ఆయన ప్రసంగించారు.

ఎన్నికల ప్రచారంలో గొట్టిపాటి ఝాన్సీ

మహాశక్తితో మరింత శక్తివంతం

ప్రజాశక్తి - పంగులూరు

మహాశక్తి పథకాలతో మహిళలు మరింత శక్తివంతంగా, ఆర్థికంగా ఎదుగుతారని ఎంఎల్ఏ గొట్టిపాటి రవికుమార్ సతీమణి గొట్టిపాటి ఝాన్సీ అన్నారు. జనకవరం గ్రామంలో టిడిపి కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా ఆమె ఆదివారం ప్రచారం చేశారు. టిడిపి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఇంటింటా కరపత్రాలు పంచారు. మహిళలకు అన్నిరంగాల్లో అత్యధిక ప్రాధాన్యతనిచ్చేది టిడిపినే అని అన్నారు. ఆడపడుచులకు స్వతంత్ర ప్రతిపత్తితో కూడిన సమజీవనం కలిగించాలన్నదే టిడిపి ఆశయమని అన్నారు. ఎన్టీఆర్ విద్య, ఉద్యోగాల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం మొదలు స్వయం సహాయక సంఘాల ఏర్పాటు వరకు టిడిపి పాలనలో తీసుకున్న నిర్ణయాలని చెప్పారు. ఈ పథకాలన్నీ మహిళల శక్తిని చాటాయని అన్నారు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలుతో సామాన్యులు బతుకుబండి లాగడం కష్టంగా మారిందని అన్నారు.

ఘనంగా 'రాయల్' ప్రథమ వార్షికోత్సవం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించడమే లక్ష్యంగా రాయల్ విద్యా సంస్థలు ఏర్పాటు చేసి 29ఏళ్లుగా ఎంతో మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేరేలా తీర్చిదిద్దుతున్న రాయల్ విద్యా సంస్థల అధినేత పేరం రవీంద్రబాబు కృషి అభినందనీయమని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు రావుల బాపయ్య అన్నారు. రాయల్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాయల్ పయనీర్స్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సైకాలజిస్టు సంద్ర సుధీర్ మాట్లాడుతూ చిన్నారుల్లో చిన్నతనం నుండే సృజనాత్మకతను వెలికితీయడానికి ఉపాధ్యాయులతో పాటు తల్లి, తండ్రుల సహకారం ఎంతో అవసరమని అన్నారు. సంద్ర సుధీర్ ప్రసంగం ఆద్యంతం ఉత్తేజ పూరితంగా సాగింది. సంస్థ సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ పేరం రవీంద్రబాబు, డైరెక్టర్ పేరం స్వప్న మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యాబోధన అందించాలనే లక్ష్యంతో రాయల్ విద్యా సంస్థలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 29ఏళ్ల అనుభవంతో డిజిటల్ విద్యాబోధన ద్వారా మెరుగైన విద్యను అందించాలనే లక్ష్యంతో స్థాపించినట్లు తెలిపారు. అత్యాధునిక బోధనా పద్ధతులు, పూర్తిస్తాయి వసతులతో ఆహ్లాదకరమైన తరగతి గది వాతావరణంతో,

సర్టిఫికేట్లు అందజేస్తున్న పేరం రవీంద్రబాబు

ఆంగ్లభాషాలో నిపుణులైన ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పాఠశాల ఇంచార్జ్ కుడారి మధుబాబు మాట్లాడుతూ 1995 నుండి విద్యా రంగంలో రాయల్ విద్యా సంస్థలు సాధించిన విజయాలను వివరించారు. స్థాపించిన నాటి నుండి 10వ తరగతి పరిక్ష ఫలితాల్లో ఒక్కరికో ఇద్దరికో కాకుండా ప్రతి విద్యార్థిని అగ్రస్థానంలో నిలబెట్టడానికి ఉపాధ్యాయుల సహకారంతో కృషి చేసిందని తెలిపారు. అనంతరం కిండర్ గార్డెన్ పూర్తిచేసుకున్న చిన్నారులకు సర్టిఫికేట్, మెడల్స్ అందించి గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంఈఓ వస్రాం నాయక్. హిస్టరీ లెక్చరర్ టి సాంబయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ బి రాధిక, హెచ్ఎం డివి బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

సాహిత్య పురస్కారాలు బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ సాహిత్య పురస్కారసభకు డివిఎం సత్యనారాయణ అధ్యక్షత వహించారు. అక్షర వైద్యుడు, భాషోద్యమ సేనాని, పూర్ణ ప్రజ్ఞాశాలి పూర్ణచందని అధ్యక్షత వహించిన సత్యనారాయణ పూర్ణచందు సాహితీసేవలను కొనియాడారు. చప్పిడివీరయ్య సభాహ్వానం చేశారు. వారణాసి రఘురామశర్మ పురష్కార గ్రహీతను పరిచయం చేశారు. పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ సేవలను ప్రసన్న వివరించారు. పురస్కార గ్రహీత డాక్టర్ జివి పూర్ణచందు యాభై ఏళ్ల సాహిత్య ప్రయాణాన్ని కెవి పోలిరెడ్డి తెలిపారు. డాక్టర్ యు దేవపాలన ముక్కాల పుస్తకాన్ని పరిచయం చేశారు. ఈ మినీ కవితల ద్వారా కవిత్వ లక్ష్యాలను ఈనాటి యువకవులకు వివరించారని తెలిపారు. ముక్కాలు పుస్తకం ఒకేసారి ఏడుభాషల్లోకి అనువదించటం ఒక విశేషమని అన్నారు. డాక్టర్ జివి పూర్ణచందు మరో రచన 'సొంపైన తెలుగు' పుస్తకాన్ని ఆర్వి రాఘవరావు పరిచయం చేశారు. పరువు పుస్తకాన్ని గురించి ఇలపావులూరి శేషతల్ప శాయి, మరో తెలుగు సూర్యుడు పీటర్ పెర్సివాల్ పుస్తకంను కొండకావూరి కుమార్ వివరించారు. పురస్కార గ్రహీత డాక్టర్ జివి పూర్ణచందు మట్లాడుతూ ప్రాచీన కావ్యాలను పునర్ మూల్యాంకనం చేయాల్సిన బాధ్యత రచయితలపై ఉందని అన్నారు. చిన్నయసూరి అచ్చతెనుగు పదాలను తన గ్రంథాల్లో విరివిగా వాడరని అన్నారు. వాటి అర్థాలు తెలియక చిన్నయసూరిని అపార్థం చేసుకున్నారని అన్నారు. అందుకే తాను చిన్నయసూరి పదకోశం పరిశోధన చేస్తున్నానని తెలిపారు. అన్నమయ్య తన

సాహిత్య పురష్కారాలు అందజేస్తున్న దృశ్యం

కావ్యాల్లో నాటి ఆంధ్రుల ఆహార పదార్థాలను అచ్చమైన తెలుగు పదాలతో చొప్పించారని అన్నారు. మంచి పుస్తకాలు వరంగా లభించాలని అన్నారు. విస్తృతంగా చదవాలని అన్నారు. పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ సాహిత్య పురస్కార ద్రవ్యం రూ.10వేలు, పట్టువస్త్రాలు, జ్ఞాపికను పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ అందచేశారు. సాహితీ మిత్ర మండలి కార్యవర్గం గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీరవల్లి రుద్రయ్య, బి చంద్రశేఖర్, విజయలక్ష్మి, చుండూరి మురళీ సుధాకర రావు, లక్కరాజు శ్రీనివాసరావు, మలాది శ్రీనివాసరావు, వామరాజు వెంకటేశ్వర్లు, ఓరుగంటి శ్రీనివాసరావు, కుందా సుబ్బారావు, కోలలపూడి శ్రీనివాసరావు, బాచిన పూర్ణచంద్ర, వఠ్యం సీతారామశాస్త్రి, గాడేపల్లి దివాకరదత్తు, పువ్వాడ రామకోటేశ్వరరావు, పసుపులేటి ఆంజనేయులు, చిన్ని మురళీకృష్ణ, పిఎల్వి నరసింహారావు, పిసిహెచ్ కోటయ్య, ఊటుకూరి రామకోటేశ్వరరావు, మారం కోటేశ్వరరావు, అంగలకుర్తి ప్రసాదు, భువనేశ్వరి, కె రామ్మోహనరావు, ఎస్ఎల్ఎన్ ప్రసాదు, మంచికలపాటి రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఇంకొల్లులో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

అంబేద్కర్ నగర్‌లో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

స్థానిక అంబేద్కర్ నగర్ పెద్దల సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని మంచి నీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం ఒక్క రోజు మాత్రం మజ్జిగ పంపిణీ చేశారు. దీంతో పాదచారులు అంబేద్కర్ యూత్‌ను అభినందించారు. కార్యక్రమంలో అంబేద్కర్ నగర్ సంఘ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

పాల్గొన్న సీనియర్ సిటిజన్స్

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకం

ప్రజాశక్తి - బాపట్ల

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకమని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జీవి బ్రహ్మం అన్నారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, ప్రజా సంఘాల ఐక్య వేదిక సంయుక్తంగా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆదివారం చర్చా వేదిక నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు విజ్ఞతతో మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని అన్నారు. గంటసాల చైతన్యవేదిక జాతీయ అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ సామాజిక శాస్త్రాలు, రాజనీతి శాస్త్రం అధ్యయనం అవసరమని అన్నారు. ప్రజాస్వామ్యానికి పంచ ప్రమాదాలైన ధనం, కులం, మతం, మద్యం, నేరస్థ రాజకీయాలపై చర్చ జరగాలని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు జీవీ సుబ్రహ్మణ్యం, కోట సుబ్బారావు, జివిఎల్ వెంకట్రావు, ఆర్ఎన్ వర్మ, ఎన్ఎస్ గుప్తా, పి నీలా కోటేశ్వరావు, వి రాధాకృష్ణ మూర్తి, జెట్టి జోసెఫ్, అబ్దుల్ మునాఫ్ పాల్గొన్నారు.

సైకిల్ యాత్రలో కమతం శివసుబ్రమణ్యం

'అనగాని'ని గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి - రేపల్లె

టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి అనగాని సత్యప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ తెలుగు ప్రొఫెషనల్ వింగ్ ఆధ్వర్యంలో మండలంలో ఆదివారం సైకిల్ యాత్ర నిర్వహించారు. 8వ రోజు సైకిల్ యాత్ర మండలానికి చేరుకోవడంతో తెలుగు యువత అధ్యక్షులు కమతం శివ సుబ్రహ్మణ్యం స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఏ అనగాని సత్యప్రసాద్ ఆదేశాలతో 9మంది తెలుగు ప్రొఫెషనల్ వింగ్ సభ్యులు సైకిల్ యాత్ర నిర్వహించారని తెలిపారు. గ్రామాల్లో సైకిల్ యాత్రతో ప్రజలను చైతన్య పరుస్తూ సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్నట్లు తెలిపారు. టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు.

కుళాయి వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్

ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వై. రమేష్ కృషితో బీసీ (పాములవారి) కాలనీలో నీటి సమస్య పరిష్కారమైంది. పాములవారి కాలనీలో నీటి సమస్యను పరిష్కరించడంలో పంచాయతీ పాలకులు నిర్లక్ష్యం వహించారు. దీంతో నీటి సమస్య పరిష్కారం కోసం పాముల వారి కాలనీ వాసులు అనేక సార్లు నిరసన తెలిపారు. స్పందించిన ఆర్‌డబ్ల్యుఎస్ రమేష్ అ సంపూర్తిగా ఆగి ఉన్న జలజీవన్ మిషన్ పథకం పనులను పూర్తి చేయించారు. కుళాయిల ద్వారా నీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టి నీటి సమస్యను పరిష్కరించారు. తమ ఇబ్బందులను గుర్తించి నీటి సమస్య పరిష్కారం కోసం కషి చేసిన ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వై.రమేష్‌కు సిపిఎం తరపున పొదిలి నరసింహులు, నల్లగట్ల పోలయ్య, పోలా తిరుపతమ్మ, పాముల వారి కాలనీ ప్రజలు కతజ్ఞతలు తెలియజేశారు.

23న రామతీర్థం తిరునాళ్ల

ప్రజాశక్తి-చీమకుర్తి

రామతీర్థం గంగమ్మ తిరునాళ్ల ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు శ్రీమోక్షరామలింగేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తలు గూడ చిదంబర శాస్త్రి, గూడ రామ్మోహనరావు, కార్య నిర్వహణాధికారి భాస్కరరెడ్డి తెలిపారు. ఈనెల 23 ఉదయం 7 గంటల నుంచి గంగమ్మ అమ్మవారికి పంచామృత అభిషేకాలు ప్రారంభమవుతాయన్నారు.ప్రజల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బూచేపల్లి వెంకాయమ్మసుబ్బారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో మోక్ష రామలింగేశ్వర స్వామి దేవసానాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించినట్లు తెలిపారు. శ్రీవాసవీ గ్రానైట్ ఆధ్వర్యంలో శిద్దా కుటుంబీకుల సహకారంతో గంగమ్మ ఆలయాన్ని రంగు రంగుల విద్యుదీపాలతో అలంకరించినట్లు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని ఈదుమూడి గ్రామంలో మనం-మనఊరు-మన-ఈదుమూడి సేవాసంస్థ వ్యవస్థాపకుడు కావూరి వాసు ఆధ్వర్యంలో ఆరోగ్య సిరి కార్యక్రమంలో భాగంగా ఒంగోలు శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ వారి సహకారంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 127 మందికి బిపి ఘగర్ ,ఇసిజి, రక్త పకరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కావూరి వాసు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పేదలకు సరైన వైద్యం అందని నేపథ్యంలో తమ సంస్థ ద్వారా ప్రతినెలా ఉచిత వైద్యశిబిరం నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సరియు, డాక్టర్ ధీరజ్ ,డాక్టర్ పల్లవ్ , సంస్థ సభ్యులు మేడా బ్రహ్మయ్య, ఉప్పల వెంకట్రామయ్య, ప్రసాదు, కుర్రా వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కదిరి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండల పరిధిలోని శీలంవారిపల్లి గ్రామంలోనున్న శ్రీకోదండరామస్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా శ్రీఅంకాలమ్మ, పొలేరమ్మ అమ్మవార్లకు ఆదివారం పొంగళ్లు పెట్టారు. అందులో భాగంగా మాజీ ఎమ్యెల్యే కదిరి బాబూరావు, కదిరి ప్రకాష్‌రావు, కదిరి పార్థసారథి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పొంగళ్లు పెట్టారు. అనంతరం అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు డి.రోశయ్య తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో కదిరి రమణయ్య, కోవిలంపాడు సర్పంచి షేక్‌బుజ్జి, మాజీ ఎంపిటిసి మునగల నారాయణరెడ్డి, మురం కాశిరెడ్డి, కొట్టే శ్రీను, వెంకయ్య, శీలం మాధవరెడ్డి, జక్కం వెంకటాద్రి పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా : బాలినేని

ప్రజాశక్తి -ఒంగోలు సబర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. 'మన ఒంగోలు..మనవాసన్న' ఎన్నికల ప్రచారంలో భాగంగా 50వ డివిజన్ జయప్రకాష్‌కాలనీ ఆదివారం బాలినేని పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్లపాలనలో ప్రజలకోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. సచివాలయాలు, వాలంటీరు వ్యవస్థను తీసుకు వచ్చి సంక్షేమ పథకాలు నేరుగా అర్హులకు అందేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. మధ్యవర్తులు, లంచాలు లేకుండా ప్రజలు సంక్షేమ పథకాలు అందుకున్నారని గుర్తు చేశారు. అలాంటి ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకు రావాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. నియోజకవర్గ ప్రజలు ఇప్పటికి ఐదుసార్లు తనను ఎమ్మెల్యేగా ఆదరించారని, మరోసారి ఆదరించాలని కోరారు. ఈదపా ఎన్నికల్లో గెలిస్తే ఇటీవల ఇళ్ల పట్టాలు ఇచ్చిన పేదలందరికీ ఇళ్లు కట్టించి ఇస్తానని చెప్పారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటుకు కృషి చేస్తానని, మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. తొలుత ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వచ్చిన బాలినేని శ్రీనివాసరెడ్డికి ఆప్రాంత ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఓబుల్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : దామచర్ల

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, రానున్న ఎన్నికలలో టిడిపి అభ్యర్థులను గెలిపించాలని టిడిపి కూటమి ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్ధనరావు పిలుపునిచ్చారు. స్థానిక త్రోవగుంటలో పిడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ కండే శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టిడిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్ధనరావు, జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పదేళ్ళు వెనక్కి పోయిందన్నారు. ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయించటం, జైలు పాలు చేశారన్నారు. అన్ని వ్యవస్థలను జగన్ రెడ్డి నాశనం చేశారన్నారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదన్నారు. ధన బలం చూసుకొని ప్రతిపక్ష పార్టీలపై కక్ష సాధింపు చేపట్టారని, పోలీసులు సైతం ఆయనకు అండగా ఉన్నారన్నారు. ఇటువంటి పరిస్థితులలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో నియోజకవర్గ ప్రజలు ఆలోచించుకొని అభివృద్ధికి చిరునామాగా నిలిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు టిడిపిలో చేరారు. దామచర్ల జనార్ధనరావు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, టిడిపి నాయకులు మంత్రి శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి సూర్యప్రకాశ్ రెడ్డి, వై.శశికాంత్‌భూషణ్, కామేపల్లి శ్రీనివాసరావు, కమ్మ వెంకటేశ్వర్లు, చెన్నుపాటి వేణు, చెన్నుపాటి ప్రసాద్, కోలా ప్రభాకర్, నావూరి కుమార్, మహిళా నాయకురాళ్లు మండువ లావణ్య, అనిత, మలగా రమేష్, చిట్టెం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన వారితో దామచర్ల, మాగుంట

గాంధీ సేవలు అభినందనీయం : మేరుగ

ప్రజాశక్తి-చీమకుర్తి

రిజిస్ట్రేషన్ మరియు స్టాంపులశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా 38 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకొని ఉద్యోగ విరమణ చేసిన తెల్లమేకల గాంధీ సేవలు అభినందనీయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగునాగార్జున తెలిపారు. స్థానిక జె అండ్ ఎం ఫంక్షన్‌హాలులో తెల్లమేకల గాంధీ ఉదోగ్య విరమణ ఆత్మీయ సభ జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండి పోతాయని తెలిపారు. జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బి. జవహర్ మాట్లాడుతూ గాంధీ సౌముడనీ, అతని సేవలు అభినందనీయమన్నారు. ఉద్యోగ బాధ్యతలు చేస్తూనే ,సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయ మన్నారు.అనంతరం తెల్లమేక గాంధీ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు, ఒంగోలు గెలాక్సీ అధినేత చలువాది బదరినారాయణ, మున్సిపల్ ఛైర్మన్ గోపురపు రాజ్యలక్ష్మి, వైస్ చైర్మన్ బాపతు వెంకటరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు ఆముదాపల్లి ప్రమీలారామబ్రహ్మం, తప్పెట బాబూరావు, సోమాశేషాద్రి, సోమా శేషాద్రి,పత్తి కోటేశ్వరరావు, మేకల సులోచనా యల్లయ్య, వైసిపి పట్టణ అధ్యక్షుడు కె. శేఖరరెడ్డి, ఓబులరెడ్డి, టిడిపి నాయకులు మన్నం ప్రసాదు, మన్నం వెంకయ్య, కందిమళ్ల గంగాధరరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, పూనాటి వెంకటరావు, బీసీ సంఘాల నాయకులు ఖాదర్‌బాషా, అశోక్, పేరం శ్రీను, శ్రావణి వెంకటేశ్వర్లు, సోమరాజు కోటేశ్వరరావు శర్మ పాల్గొన్నారు.

గాంధీ దంపతులను సన్మానిస్తున్న మంత్రి నాగార్జున

హరిహరక్షేత్రం

నేటి నుంచి హరిహరక్షేత్రం వార్షికోత్సవాలు

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తిలోని శ్రీహరిహరక్షేత్రం 18వ వార్షికోత్సవాలు సోమవారం నుంచి నిర్వహిస్తునట్లు శిద్దా వెంకటేశ్వర్లు వెంకటసుబ్బమ్మ ట్రస్టు సభ్యులు శిద్దా వేంకటేశ్వరరావు, శిద్దా పాండు రంగారావు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా వెంకటేశ్వరరావు,శిద్దా హనుమంతరావు,శిద్దా సూర్య ప్రకాశరావు,శిద్దా సుధాకర్, శిద్దా హనుమంతరావు, బొమ్మిశెట్టి శ్రీనివాసరావులు తెలిపారు. ఈనెల 22న సాయంత్రం అయ్యప్పస్వామి మహాపడిపూజ, అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23న ఉదయం 8గంటలకు విశేషపూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం విశాఖ శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతిలచే మహా పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం కార్యక్రమాలు ,అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సాయంత్రం నగరోత్సవం నిర్వహిస్తునట్లు తెలిపారు. హరిహర శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

నాగభూషణచారికి సన్మానం

ప్రజాశక్తి-సిఎస్.పురం

ఉపాధ్యాయ వృత్తిని అంకితభావంతో నిర్వర్తించి విద్యార్థులలో నైపుణ్యాలు పెంపొందించిన వారిలో నాగభూషణ చారి మొదటి వరుసలో ఉంటారని ఎంఇఒ జె.ప్రసాదరావు పేర్కొన్నారు. గణేషునిపల్లి ప్రధానోపాధ్యా యుడు నాగభూషణాచారి ఉద్యోగ విరమణ సన్మాన సభ పి.మాలకొండయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి మేకల శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ సహజమని తెలిపారు. సిఎస్.పురం ఎంఇఒ-2 రాజాల కొండారెడ్డి మాట్లాడుతూ నాగాభూషణాచారి విద్యార్థుల మనసుల్లో మంచి పేరు ప్రఖ్యాతలు పొందారన్నారు. అనంతరం నాగభూషణా చారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు తోట శ్రీనివాసులు, వైస్ ఎంపిపి దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఎంపిటిసిలు జాజుల తిరుపాలు, మితికేలా గురవయ్య, సర్పంచి కష్ణకుమారి, రమణయ్య, మూడి రమణయ్య, నాయకులు కుక్కా తిరుపతయ్య, మేకల బాలు, ప్రధానోపాధ్యాయుల హనుమంతరావు, ఖాదరున్నీసాబేగం, ఉపాధ్యాయులు షేక్ నాయబ్ రసూల్, కమ్మనేతి వెంకటేశ్వర్లు, జెఎస్.ఆనంద్‌బాబు, జి.రామకష్ణ, కె.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

24న ముత్తుముల నామినేషన్

ప్రజాశక్తి-గిద్దలూరు

ఈ నెల 24న తాను నామినేషన్ దాఖలు చేయనున్నట్లు టిడిపి గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. నామిషన్ సందర్భంగా ఆరోజుల ఉదయం 9.30 గంటలకు ఆర్‌టిసి బస్టాండ్ వద్ద నుంచి ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. నామినేషన్ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.